క్లుప్తంగా

ఆర్‌కే ఓసీ సందర్శన


ఓసీని పరిశీలిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే ఓసీని సింగరేణి జీఎం(ఆర్‌అండ్‌డీ) సుభానీ శుక్రవారం సందర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను బొగ్గు ఉత్పత్తి, రవాణాలకు సంబంధించి జీఎం సుభానీని ఓఎస్డీగా నియమించడంతో ఆయన ఓసీని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఉత్పత్తి ఎంత ముఖ్యమో రవాణా అంతే ముఖ్యమనేది గుర్తించాలన్నారు. రక్షణ నియమాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తిని సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా జీఎం మనోహర్, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ సధీర్, సర్వే ఆఫీసర్ శేఖర్, ఇంజినీర్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయాలి


వేంపల్లిలో పశువులకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వై.రమేశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లిలో గాలికుంటు వ్యాధి టీకా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 62 ఆవులు, 155 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాలను పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పశువైద్యాధికారి శాంతిరేఖ, సరిత, ఎల్‌ఎస్‌ఏ అగ్నివేశ్, పశువైద్య సహాయకురాలు స్వప్న, సహాయకులు నారాయణ, సికిందర్ ఉన్నారు.

క్షయపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

జన్నారం: ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. వ్యాధి సోకే విధానం, వ్యాధి గుర్తించడం, నిర్మూలన, ఎలా తగ్గుతుందనే అంశాలను వైద్యాధికారి ఉమాశ్రీ వివరించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన కమాండెంట్


డీసీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌ను గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కమాండెంట్‌తో పాటు అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్, కాళిదాసులు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. శుక్రవారం కన్నాల జాతీయ రహదారి వద్ద నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని నిర్ణయం తీసుకున్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపిస్తామని వక్తలు పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ పథకాల కరపత్రాలను విడుదల చేశారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శులు, మండల అధ్యక్షులు, గ్రామ, పట్టణ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహార భద్రత ఏదీ..?

- కార్డుల జారీలో జాప్యం
- సంక్షేమ పథకాల లబ్ధికి దూరం
- ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు


నెన్నెలలో రేషన్ సరుకులు ఇస్తున్న డీలర్

నెన్నెల: కొత్త ఆహారభద్రత కార్డుల జారీ ప్రక్రియ దరఖాస్తులకే పరిమితమైంది. ఏళ్లు గడుస్తున్నా కార్డులు మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కొత్త కార్డులు మంజూరు కాకపోవడం, అర్హత ఉన్న పలువురికి ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. ఒక పూట భోజనం చేసేందుకు అవసరమయ్యే బియ్యం కోసం ఆరాటపడేవారు కొందరైతే, మరోవైపు ప్రభుత్వ పథకాలు, వైద్యానికి రేషన్‌కార్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. కొత్త కార్డుల మంజూరును ప్రభుత్వం నిలిపివేయడంతో దరఖాస్తుదారులు ఆగమాగం అవుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తారనుకున్న లబ్ధిదారుల ఆశలు అడియాశలయ్యాయి. ప్రతీ పథకానికి రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో మండలంలో వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మాత్రం ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు.

మండలంలో ఇలా..

నెన్నెల మండలంలో మొత్తం 14 రేషన్‌షాపులు ఉండగా 7,300 వరకు కార్డులు ఉన్నాయి. సుమారు మరో వెయ్యి మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు ఐదేళ్ల నుంచి రేషన్‌కార్డులు అందలేదు. కార్డుల కోసం మీసేవ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అందడం లేదు. కొత్త పేర్లు చేర్చడం తదితర వాటికి వందల సంఖ్యలో దరఖాస్తులు పెట్టుకుని కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.


ఆహార భద్రతకార్డులు

తప్పని తిప్పలు

ప్రస్తుతం రేషన్‌కార్డుకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ఆరోగ్యశ్రీ సేవలకు, ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఉపకార వేతనాలు పొందడానికి వీలుగా ఆదాయ, ఇతర ధ్రువీకరణపత్రాలు మంజూరు చేస్తారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గృహజ్యోతి, మహాలక్ష్మీలాంటి ఇతర పథకాలకు ఇదే ఆధారం. ఈనేపథ్యంలో కార్డులు లేని పేదలు పథకాలు అందక పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్త కార్డులు, పాత వాటిలో మార్పు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని కొన్నేళ్లుగా పేదలు ఎదురుచూస్తున్నారు. కొత్తగా వివాహం చేసుకున్న వారు కుటుంబాల నుంచి విడిపోయినవారు ఎప్పుడు కార్డులు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు. కల్యాణలక్ష్మి, ఉపకార వేతనాలు, ఆరోగ్యశ్రీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితర పథకాలకు అర్హత కోల్పోతున్నారు.

ఐదేళ్లవుతోంది



కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసి ఐదేళ్లు గడిచిపోయింది. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇప్పటివరకు మాకు రేషన్‌కార్డు రాక పిల్లల చదువులు, ఆస్పత్రులకు వెళ్లినప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తోంది. రేషన్‌కార్డు అందించాలి. – షేక్ వలి, నెన్నెల

తిప్పలైతంది



రేషన్‌కార్డు లేక ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ పథకాలు, ఇతర పత్రాలు తీసుకోవాలంటే తిప్పలైతంది. నెలనెలా అందించే బియ్యానికి నోచుకోలేకపోతున్నాం. ప్రస్తుతం ప్రభుత్వ పథకాల కోసం రేషన్‌కార్డు తప్పనిసరని అడుగుతున్నారు. కొత్త కార్డులు ఇవ్వాలి. – ఇందారపు గంగాధర్, నెన్నెల

ఆదేశాలు రాగానే అందిస్తాం



కొంత కాలంగా రేషన్‌కార్డులు అందించే ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే అర్హులందరికీ కార్డులు అందిస్తాం. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారందరివి రెవెన్యూ, తహసీల్దార్లు విచారణ జరిపి అర్హులను ఎంపిక చేస్తారు. దరఖాస్తుచేసుకున్న వారి వివరాలను జిల్లా అధికారులకు ఇదివరకే పంపించాం. – సబ్బ రమేశ్, తహసీల్దార్, నెన్నెల

అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీ ఆపాలి


గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని కార్మికుల నుంచి చేస్తున్న అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరిని వెంటనే ఆపాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ కార్యదర్శి ఎం.వెంకటస్వామి, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం శాంతిఖని గనిపై ధర్నా చేసి గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోని గనుల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాల నుంచి అండర్‌గ్రౌండ్ అలవెన్స్‌ను యాజమాన్యం రికవరీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందని తెలిపారు. ఈతంతు గడిచిన మూడు నెలల నుంచి కొనసాగుతోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రికవరీ చేయడాన్ని భేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గనులపై అధికారుల వేధింపులు పెరిగిపోతున్నాయని, కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా వేధించడం పనిగా పెట్టుకుంటున్నారని అన్నారు. సింగరేణి ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు సంఘానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా యాజమాన్యం వివక్షత చూపుతోందని మండిపడ్డారు. కార్మికులకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని, సొంతింటి నిర్మాణం కోసం కంపెనీ రెండు గుంటల భూమిని కేటాయించాలన్నారు. శాంతిఖని ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతి, నాయకులు మంతెన రమేశ్, బొంకూరి రాంచందర్, స్వామిదాస్, ప్రవీణ్, కొమురయ్య, శ్రీనివాస్, రాజలింగు, సురేష్, రాజన్న, భాస్కర్, వెంకటయ్య, గని మైన్స్ కమిటీ, సెఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాలు పునరావృతం కావొద్దు

- శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఏదేని ప్రమాదం జరిగితే, మరోసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో రక్షణపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో ఇటీవల ఎస్సార్పీ 1 గనిలో జరిగిన ప్రమాదంపై చర్చించారు. రక్షణపై ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ గనిలో రక్షణ కమిటీ ఆడిట్ చేస్తామన్నారు. ఈనెల 23 నుంచి 27 వరకు సేఫ్టీ ఆడిట్ హాలేజ్, మ్యాన్ రైడింగ్ సిస్టంపై అన్ని గనుల్లో సమీక్ష, తనిఖీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూజీఎం పురుషోత్తంరెడ్డి, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో ప్రతిభ

నస్పూర్: గత నెలలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని గోనె ప్రసన్న ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. డీఈవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డీఈవో యాదయ్య విద్యార్థినికి రూ.2 వేల నగదు బహుమతిని అందజేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, సెక్టరోల్ అధికారులు కమ్మచౌదరి, ఎంఎస్ మూర్తి, పాఠశాల హెచ్‌ఎం రామన్న, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే

- జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


పార్టీలో చేరిన వారితో రఘునాథ్

దండేపల్లి: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కన్నెపల్లిలో గ్రామ మాజీ సర్పంచ్ రజనీతోపాటు మరికొందరు, కొత్తమామిడిపల్లి, ముత్యంపేట గ్రామాలకు చెందిన పలువురు శుక్రవారం బీజేపీలో చేరారు. రఘునాథ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వందరోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి అవి పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో పెద్దపెల్లి నియోజకవర్గ పరిధిలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు ప్రభాకర్, గురువయ్య, సత్తన్న, సురేందర్, సీపిరిషెట్టి శ్రీనివాస్, శేఖర్, లక్ష్మణ్, గిరిధర్, చిట్ల శ్రీనివాస్, వెంకటేశ్, ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు వసతులు కల్పించాలి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు యాజమాన్యం సరైన వసతులు కల్పించాలని జీఎం మనోహర్‌కు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. యూనియన్ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు విధులు నిర్వహించే స్థలాల్లో వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నాయకులు దాగం మల్లేశ్, అంజనేయులు, తిరుపతి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్ ఎన్.పద్మకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వుమెన్ అచీవర్స్ 2024 అవార్డును పొందిందిద. యాదవ హక్కుల పోరాట సమితి సభ్యులు శుక్రవారం ఆమెను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు అంజయ్య, పట్టణ అధ్యక్షుడు పర్శ రాజన్న యాదవ్, బూస మహేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా చేరిన ఎంబీబీఎస్ విద్యార్థులకు శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. వారికి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఆటపాటలతో అలరించగా, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ సులేమాన్, సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, వైద్యకళాశాల బృందం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

బెల్లంపల్లి: పట్టణంలోని రడగంబాలబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొని మాట్లాడారు. మహిళలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కేంద్రాల్లో అందించే పదార్థాలను పిల్లలకు అందించడం తోపాటు గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. తల్లులు,పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సక్కుబాయి, సమ్మక్క, రాధ, పద్మ, రమాదేవి పాల్గొన్నారు.

మంచిర్యాలలో..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ సెక్టార్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచనాదేవి, అంగన్‌వాడీ టీచర్లు రేణుకాదేవి, సురేఖ, రాజేశ్వరి, పద్మావతి, ఆర్పీలు శారద, సవిత, ఏఎన్‌ఎం పద్మ ఉన్నారు.

భీమారంలో..

భీమారం: భీమారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు సరళ, మణిమాల, రమ, దుర్గతోపాటు పిల్లల తల్లులు ఉన్నారు.

కిష్టంపేటలో..

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాల ప్రాముఖ్యత, పోషక విలువలు ఉన్న ఆహారం గురించి తెలియజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ టీచర్లు అమృత, సుగుణ, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

పుల్లగామలో..

కోటపల్లి: పుల్లగామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, యశోద, ప్రశాంతి, విజయలక్ష్మి, ఈశ్వరి పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

లక్సెట్టిపేట: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో రేష్మ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన పోషకాహార అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. మహిళా సాధికారిత హబ్‌జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక, సూపర్‌వైజర్ దీపవాహిని, అంగన్‌వాడీ టీచర్స్, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు


రామకృష్ణాపూర్: టపాసులు కాలుస్తున్న నాయకులు


భీమారంలో సంబరాలు పాల్గొన్న నాయకులు

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీకి అధిష్టానం టికెట్ కేటాయించడంపై ఆ పార్టీ నాయకుల సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్‌లో శుక్రవారం టపాసులు కాల్చారు. భారీ మెజార్టీతో వంశీని గెలిపిస్తామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, నీలం శ్రీనివాస్‌గౌడ్, గోపతిరాజయ్య, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: భీమారం జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చారు. స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా నాయకులు పాడేటి రవి, బుక్యా లక్ష్మణ్, మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చెన్నూర్: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.అరుణ్‌కుమార్, అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంశీకృష్ణకు ఎంపీ టికెట్ కేటాయించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాతర్ల నాగరాజు, ఖాలీల్, నహీమ్, మహేశ్, సుమంత్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని యువజన కాంగ్రెస్ చెన్నూర్ అధ్యక్షుడు సట్ల సంతోష్ అన్నారు. పట్టణంలోని ఐఎన్టీయూసీ ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. నాయకులు రాజేందర్‌గౌడ్, శ్రీకాంత్, అంజి, సంపత్ తదితరులు ఉన్నారు. గడ్డం వంశీకృష్ణకు టికెట్ కేటాయించడం పట్ల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఫ్లాగ్‌మార్చ్‌లో ఏసీపీ ప్రకాశ్, సీఐ అశోక్

నస్పూర్: త్వరలో జరుగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం సీసీసీ నస్పూర్ పోలీసుల ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తా నుంచి నస్పూర్ కాలనీ, షిర్కే, రాయల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ చౌరస్తా, సీసీసీ కార్నర్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తా వరకు ఫ్లాగ్‌మార్చ్ సాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలందరికీ ఎన్నికల్లో భద్రత, భరోసా కల్పించడానికి సీఆర్‌పీఎఫ్ బలగాల ద్వారా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెల్డర్ పోస్టులతో నూతన నోటిఫికేషన్ ఇవ్వాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో ఈనెల 14న ప్రకటించిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో వెల్డర్లకు అవకాశం కల్పిస్తూ నూతన నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ ఏరియా జీఎం మనోహర్‌కు వెల్డర్ అభ్యర్థులు శుక్రవారం వినతిపత్రం అందించారు. శ్రీకాంత్, రాకేష్, సాయికిరణ్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన


ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం ఆవరణలో గల శివాలయంలో శుక్రవారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అర్చకులు అంబాప్రసాద్, చక్రవర్తిల మంత్రోచ్ఛరణాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్రాల కోసం వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని హాజీపూర్ రైతు ఉత్పత్తి సంస్థకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ సంతోశ్‌కు సభ్యులు విన్నవించారు. నాబార్డు సహకారంతో మూడేళ్ల క్రితం ప్రారంభించిన హాజీపూర్ రైతు ఉత్పత్తి సంస్థలో 528 మంది సభ్యులు ఉన్నారని, సంస్థ అభివృద్ధి కోసం అర్గానిక్, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. కర్ణమామిడి, పెద్దంపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించుకునేలా అనుమతి ఇప్పించాలని వేడుకున్నారు.

క్రైస్తవుల ర్యాలీ

మందమర్రిరూరల్: గుడ్‌ఫ్రైడే ఉపవాసదినాలు పురస్కరించుకుని శుక్రవారం నెన్నెల మండలం జెండా వెంకటాపూర్ నుంచి పలువురు క్రైస్తవులు మందమర్రిలోని బొక్కలగుట్టలోని చర్చికి ర్యాలీగా బయల్దేరారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరవుతామని వారు తెలిపారు.

27న తైబజారు వేలం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ తైబజారు వేలం ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జి.మల్లారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు పట్టణంలోని కూరగాయల సంత (తైబజారు) వేలం ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వ్యాపారులు వివరాల కోసం మున్సిపల్ కార్యాలయం పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఉచిత దంతవైద్య శిబిరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లో హెల్పేజ్ ఇండియా, ఇన్ఫర్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు అజయ్, హెల్పేజ్ ఇండియా ప్రాజెక్ట్ ఇన్‌చార్జి శివకృష్ణ, కార్యదర్శులు ప్రతిభ, సరిత పాల్గొన్నారు.

దేవతామూర్తుల ప్రతిష్ఠ

నెన్నెల: మండలంలోని మైలారంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో పండితుడు నరహరిశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం దేవతామూర్తుల ప్రతిష్ఠ యాగం, యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. అంతకుముందు కుంభాభిషేకం, పూర్ణాహుతి యాగం చేపట్టారు. ముఖ్యఅతిథులుగా బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ స్వామి హాజరయ్యారు.